సాక్షి
మెదక్
గురువారం । 18 । సెప్టెంబర్ । 2025



సేవే లక్ష్యం..

సేవే లక్ష్యంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు ఎన్ఎస్ఎస్ వలంటీర్లు..

వివరాలు 8లో ▸



'సంజీవని'తో..

సంజీవని ఆస్పత్రి పసి హృదయాలను పదిలం చేస్తున్న దేవాలయం అని ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు.

వివరాలు 8లో ▸



భూమి, భుక్తి కోసం పోరాటం

భూమి, భుక్తి, వెట్టిచాకిరీ నిర్మూలన కోసం సాయుధ పోరాటం జరిగిందని సీపీఐ నేత అడివయ్య అన్నారు.

వివరాలు 9లో ▸

విప్లవాత్మక అభివృద్ధి

- ముమ్మరంగా ఆరుగ్యారంటీల అమలు
- సమస్యల పరిష్కారంలో ముందంజ
- ప్రజాపాలన దినోత్సవంలో మంత్రి వివేక్ వెంకటస్వామి

మెదక్‌జోన్: ఎందరో మహానుబావుల త్యాగఫలితమే నేటి తెలంగాణ అభివృద్ధికి నాంది పలికిందని జిల్లా ఇన్‌చార్జి మంత్రి వివేక్ వెంకటస్వామి పేర్కొన్నారు. ప్రజాపాలన దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం కలెక్టరేట్‌లో ఆయన జాతీయజెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సెప్టెంబర్ 17 రాష్ట్రంలో కీలకమైందని, ఈ ప్రాంతం దేశంలో విలీనమై 77 ఏళ్లు గడుస్తుందన్నారు. స్వేచ్ఛ, స్వాతంత్ర్యం, ప్రజాస్వామ్యం సొంతం కావడానికి ఎంతో మంది ప్రాణ త్యాగం చేశారన్నారు. రాచరిక వ్యవస్థకు వ్యతిరేకంగా దొడ్డి కొమురయ్య, చాకలి ఐలమ్మ, మల్లుస్వరాజ్యం, ఆరుట్ల కమలాదేవి పోరాటం చేశారన్నారు. అప్పటి ప్రధాని నెహ్రూ, హోంమంత్రి వల్లబాయ్ పటేల్ కృషితో 1948 సెప్టెంబర్ 17న హైదరాబాద్ సంస్థానం దేశంలో విలీనమైందన్నారు.

హామీల అమలుకు కృషి

రాష్ట్ర ప్రభుత్వం ఆరుగ్యారంటీల అమలుతో పాటు ప్రజా సమస్యల పరిష్కారంలో ముందంజలో ఉందని మంత్రి వివేక్ అన్నారు. అధికారంలోకి వచ్చిన 48 గంటల నుంచి హామీల అమలుకు కృషి చేస్తుందన్నారు. ఊరూరా ఇందిరమ్మ గ్రామసభలను నిర్వహించి ప్రజలనుంచి దరఖాస్తులు స్వీకరించి పథకాలను అమలు చేస్తుందన్నారు. మహాలక్ష్మి పథకం ద్వారా జిల్లా వ్యాప్తంగా 3.55కోట్ల మంది మహిళలు ప్రయాణించగా.. ఆర్టీసీకి రూ. 87.81 కోట్లు ఆదా అయిందని మంత్రి వివరించారు. అలాగే గృహజ్యోతి పథకంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా 1,27,381 విద్యుత్ వినియోగదారులకు 200 యూనిట్లలోపు జీరో బిల్లు జారీచేసింది. తద్వారా లబ్ధిదారులకు రూ 69.19 కోట్ల సబ్సిడీని ప్రభుత్వం చెల్లించిందన్నారు.

అభివృద్ధికి పెద్దపీట

రుణమాఫీ పథకంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా 87,491 మంది రైతులకు గానూ రూ.645.41 కోట్ల రుణమాఫీ చేసిందని మంత్రి వివేక్ అన్నారు. అలాగే రైతు భరోసా పథకంలో భాగంగా 2025 ఏడాదికి గానూ 2,62,043 మంది రైతులకు రూ 220.84 కోట్లు రైతుల ఖాతాల్లో జమచేసిందన్నారు.



ప్రసంగిస్తున్న మంత్రి వివేక్

అదే విధంగా రాజీవ్ ఆరోగ్య శ్రీ పథకంలో భాగంగా రూ. 5 లక్షల నుంచి రూ 10 లక్షలకు పెంచిందన్నారు. దీంతో జిల్లాలో 25,826 మంది పేదలు చికిత్స పొందగా.. రూ.68.84 లక్షలు ప్రభుత్వం ఖర్చు చేసిందన్నారు. అంతే కాకుండా జిల్లాకు మెడికల్ కళాశాల మంజూరు చేసి నూతన భవన నిర్మాణం కోసం రూ. 180 కోట్లు, నార్సింగ్ కాలేజీ బిల్డింగ్ కోసం రూ. 26 కోట్లు మంజూరు చేసిందన్నారు. జిల్లాలో 1,26,796 మంది వినియోగదారులకు 4,68,195 గ్యాస్ సిలిండర్లను రూ. 500 చొప్పున అందించినట్లు తెలిపారు. అలాగే జిల్లాలో 18,130 కొత్త కార్డులను అందించి వారికి సెప్టెంబర్‌లో 598 మెట్రిక్ టన్నుల బియ్యం సరఫరా చేసిందన్నారు. విద్యాశాఖ అభివృద్ధికి కృషి చేసిందన్నారు. 74,265 వేల మంది విద్యార్థులకు 2 జతల స్కూల్ యూనిఫాం, ప్రభుత్వ జూనియర్ కాలేజీలకు మరమ్మతుకు రూ. 3.26 కోట్లు, కొత్తగా యంగ్‌ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణానికి రూ. 200 కోట్లు మంజూరు చేశామన్నారు.



ప్రజాపాలన దినోత్సవ వేడుకల్లో జాతీయజెండాకు వందనం చేస్తున్న మంత్రి వివేక్ వెంకటస్వామి

ఇందిరమ్మ ఇళ్లు

ఇందిరమ్మ ఇళ్ల మొదటి విడతలో భాగంగా జిల్లా వ్యాప్తంగా 9,154 ఇళ్లు మంజూరు చేయగా.. రూ. 457.70 కోట్లు విడుదల చేసిందన్నారు. అలాగే మహిళాశక్తి భవననిర్మాణానికి రూ. 5 కోట్లు కేటాయించి పనులు చేపట్టామన్నారు. అలాగే వడ్డీలేని రుణాల కింద 10,574 మంది మహిళా సంఘాలను రూ. 21.69 కోట్ల వడ్డీరాయితీ అందించామన్నారు. పంచాయతీరాజ్ శాఖ ద్వార ఏడుపాయల వనదుర్గా మాత ఆలయ అభివృద్ధికి రూ. 35 కోట్లు, మెదక్ చర్చి అభివృద్ధికి రూ. 29.18 కోట్లు కేటాయించినట్లు మంత్రి వివేక్ పేర్కొన్నారు. అంతకు ముందు తెలంగాణపై కళాకారులు ఆలపించిన పాటలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే రోహిత్‌రావు, కలెక్టర్ రాహుల్‌రాజ్, అదనపు కలెక్టర్ నగేష్, ఎస్పీ డీవీ శ్రీనివాస్‌రావు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుహాసినిరెడ్డి, అదనపు ఎస్పీ మహేందర్, ఆర్డీఓ రమాదేవి, మాజీ మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్ తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

ఎందరో త్యాగఫలితమే..

బీజేపీ జిల్లా అధ్యక్షుడు మల్లేశంగౌడ్



బీజేపీ కార్యాలయంలో జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న మల్లేశంగౌడ్

మెదక్‌జోన్: నిరంకుశ, రాచరిక నిజాంపాలన విముక్తికోసం ఎంతోమంది మహానుభావుల త్యాగఫలితమే సెప్టెంబర్ 17 విమోచన దినోత్సవమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు మల్లేశంగౌడ్ పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో జాతీయజెండాను ఆవిష్కరించారు. అలాగే ప్రధాని నరేంద్రమోదీ జన్మదినం సందర్భంగా ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో పలువురు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రాగి రాములు, సుభాష్ గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శులు శ్రీనివాస్, రంజిత్ రెడ్డి, నాయిని ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపాలన దినోత్సవానికి దూరం!



అల్లాదుర్గం ఇరిగేషన్ కార్యాలయం భవనంలో ఎగరని జాతీయజెండా

అల్లాదుర్గం(మెదక్): ప్రభుత్వం ప్రజా పాలనా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని, ప్రభుత్వ కార్యాలయాలపై బుధవారం జాతీయ జెండాలను సూచించింది. అయితే జాతీయ జెండాను ఎగురవేయాల్సి ఉండగా ఇరిగేషన్ అధికారులు దూరంగా ఉన్నారు. ఈ సంఘటన అల్లాదుర్గంలో చోటుచేసుకుంది. కాగా, ఇరిగేషన్ కార్యాలయం పట్టణానికి దూరంగా ఉండటంతో విధుల నిర్వహణపై తెలియని పరిస్థితి నెలకొందని స్థానికులు చెబుతున్నారు. మరోవైపు ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా జాతీయ జెండాను ఎగరవేయకుండా అధికారులు దూరంగా ఉండటం గమనార్హం. ఈ కార్యాలయంలో ఇరిగేషన్ డీఈ, ఏఈ, జూనియర్ అసిస్టెంట్, మరో ముగ్గురు లష్కరులు విధులు నిర్వహిస్తున్నారు. ఇంతమంది ఉన్న కార్యాలయం వద్ద జాతీయ జెండాను ఎగురవేయకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఇన్‌స్పైర్ దరఖాస్తు గడువు పెంపు

డీఈఓ రాధా కిషన్

మెదక్ కలెక్టరేట్: ఇన్‌స్పైర్ అవార్డుల కోసం దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 30 వరకు గడువు పొడిగించినట్లు డీఈఓ ప్రొఫెసర్ రాధా కిషన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటి వరకు జిల్లాలో వివిధ పాఠశాలల నుంచి 695 నామినేషన్లు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసినట్లు తెలిపారు. నేటికీ నమోదు చేయని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు గైడ్ టీచర్లు ప్రత్యేక చొరవ చూపి త్వరగా నామినేషన్లను ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాలన్నారు ఇతర వివరాలకు జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి నంబర్. 8328 599157ను సంప్రదించాలని సూచించారు.

ఎంపీడీఓ భవనంలో కోర్టు సేవలు

తూప్రాన్:ఎంపీడీఓ కార్యాలయంలో త్వరలోనే కోర్టు సేవలు అందుబాటులోకి రానున్నాయని ఆర్డీఓ జయచంద్రారెడ్డి బుధవారం పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ మండలానికి నూతనంగా మంజూరైన కోర్టుకు సరైన భవన సముదాయం లేకపోవడంతో కొంతకాలం జాప్యం నెలకొందన్నారు. ఇందులో భాగంగానే నూతనంగా నిర్మాణంలో ఉన్న సమీకృత సముదాయ భవనంలో ఎంపీడీఓ కార్యాలయం కొనసాగుతుందన్నారు. ఇందుకోసం ఈ నెల 25న కోర్టు కొనసాగేందుకు ఎంపీడీఓ కార్యాలయాన్ని మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశాలు, జిల్లా కలెక్టర్ సూచన మేరకు అప్పగిస్తున్నట్లు తెలిపారు. అలాగే నూతన సమీకృత భవనంలో త్వరలో తహసీల్దార్, ఆర్డీఓ కార్యాలయం సైతం అందుబాటులోకి రానుందని తెలిపారు.

స్పెషలిస్ట్ వైద్యులతో కంటి పరీక్షలు

చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్పెషలిస్ట్ వైద్యులతో కంటి పరీక్షలు నిర్వహించనున్నట్లు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రేఖ తెలిపారు. ఈ సందర్భంగా ఈనెల 18 నుంచి అక్టోబర్ 2 వరకు స్వస్థనారీ స్వశక్తి అభియన్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా రేపటి నుంచి కంటి వైద్య నిపుణులు అందుబాటులో ఉంటారని తెలిపారు. కావున మండలంలోని ప్రజలు కంటి పరీక్షల కోసం నార్సింగి ఆస్పత్రికి వచ్చి వైద్య పరీక్షలు చేయించుకోవాలని కోరారు.

తాత్కాలిక మరమ్మతులకు రూ.10కోట్లు



మాట్లాడుతున్న మంత్రి వివేక్

మెదక్ కలెక్టరేట్: ఇటీవల జిల్లాలో కురిసిన భారీ వర్షాలకు జరిగిన నష్టానికి శాశ్వతంగా చేపట్టే పనులపై రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని మంత్రి వివేక్ వెంకటస్వామి తెలిపారు. బుధవారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో ఇరిగేషన్, పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ, విద్యుత్, విద్యాశాఖ, మెడికల్ అండ్ హెల్త్, వ్యవసాయం, మత్స్యశాఖ, పశుసంవర్ధక శాఖ, మిషన్ భగీరథ, జిల్లా పంచాయతీ, మున్సిపల్ కమిషనర్ వివిధ శాఖల అధికారులతో వరద నష్టం అంచనాలపై సమీక్షించారు. మెదక్ జిల్లాను వరద నష్టాల నుంచి సాధారణ స్థితికి వచ్చే విధంగా చర్యలు చేపడతామన్నారు. తక్షణ సహాయం కింద రాష్ట్ర ప్రభుత్వం జిల్లాకు రూ.10 కోట్లు మంజూరు చేసిందన్నారు. అంతకు ముందు కలెక్టరేట్‌లో విశ్వకర్మ మహర్షి చిత్రపటానికి మంత్రి వివేక్ వెంకటస్వామి, ఎమ్మెల్యే రోహిత్ రావు, కలెక్టర్ రాహుల్ రాజ్, అదనపు కలెక్టర్ నగేష్, ఎస్పీ డీవీ శ్రీనివాసరావు, అదనపు ఎస్పీ మహేందర్, డీఆర్ఓ భుజంగరావు, ఇతర శాఖల జిల్లా అధికారులు నివాళులర్పించారు.

ఇసుక మాఫియా అంతానికే ఇసుక బజార్లు



ఇసుక బజారును ప్రారంభిస్తున్న మంత్రి వివేక్, చిత్రంలో కలెక్టర్, అదనపు కలెక్టర్, నాయకులు

నర్సాపూర్: రాష్ట్రంలో ఇసుక మాఫియాను అంతం చేయడానికే ప్రభుత్వం ఇసుక బజార్లు ఏర్పాటు చేస్తుందని జిల్లా ఇన్‌చార్జి మంత్రి వివేక్ వెంకటస్వామి చెప్పారు. బుధవారం నర్సాపూర్‌లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఇసుక బజారుతో పాటు రూ. కోటితో నిర్మించిన వైకుంఠధామం ఇందిరమ్మ మోడల్ హౌజ్ వంటి అభివృద్ధి పనులను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో బీఆర్ఎస్ నాయకులు ఇసుక మాఫియా అవతారమెత్తారని ఆరోపించారు. కానీ సీఎం రేవంత్‌రెడ్డి పదవి చేపట్టిన తర్వాత ఇసుక మాఫియాను అంతం చేయాలన్న లక్ష్యంతో నియోజకవర్గాల స్థాయిలో ఇసుక బజార్లు ఏర్పాటు చేస్తున్నామని మంత్రి చెప్పారు. కాగా, ఇటీవల కురిసిన వర్షాలకు పాడైన రోడ్లు, కల్వర్టులు వివరాలు సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి అధిక నిధులు మంజూరు చేయించేందుకు తన వంతు కృషి చేస్తానని మంత్రి హామీ ఇచ్చారు. జిల్లాలోని పేద, మధ్య తరగతికి చెందిన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఇసుకను అందచేసేందుకు ఇసుక బజార్లు ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ రాహుల్‌రాజ్ చెప్పారు. ఈ కార్యక్రమాల్లో కలెక్టర్ రాహుల్‌రాజ్, అదనపు కలెక్టర్ నగేష్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సుహాసినిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, ఆర్‌డీఓ మహిపాల్, డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ ఆవుల రాజిరెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ శ్రీరాంచరన్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ రాజుయాదవ్, మైనింగ్ ప్రాజెక్టు మేనేజర్ శ్రీకాంత్, ఇసుక బజార్ ఇన్‌చార్జ్ రాకేష్, ఆయా శాఖల అధికారులు, నాయకులు పాల్గొన్నారు.




ఉత్తరప్రదేశ్ అధికారులు, సర్పంచ్‌లకు స్వాగతం పలుకుతున్న అధికారులు, నాయకులు

గ్రామాల్లో యూపీ అధికారుల సందడి

నర్సాపూర్ రూరల్: మండలంలోని అవంచ, రెడ్డిపల్లి గ్రామాల్లో బుధవారం ఉత్తరప్రదేశ్‌కు చెందిన పంచాయతీ శాఖ అధికారులు, సర్పంచ్‌లు పర్యటించారు. తెలంగాణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ సీడీపీఏ అనిల్ కుమార్ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ పాలన, అభివృద్ధి పనులపై అధ్యయనం చేశారు. గ్రామపంచాయతీలో జరుగుతున్న పారిశుద్ధ నిర్వహణ, తడి, పొడి చెత్త, నిధుల సమీకరణ, వాటర్ హార్వెస్టింగ్, నర్సరీలు, ఫారం ఫండ్, అంగన్ వాడీ కేంద్రాలు, పాఠశాలలు, స్వయం సహాయక సంఘాల నిర్వహణ తీరును తెలుసుకున్నారు. ఈ మేరకు డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్, అవంచ, రెడ్డిపల్లి గ్రామాలకు చెందిన మాజీ సర్పంచ్‌లు, రాజకీయ నాయకులు వారికి ఘన స్వాగతం పలికారు. అనంతరం తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలను తెలియజేసేందుకు బతుకమ్మ ఆటాపాటలు, ఆయా రకాల సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ మధులత, డీఎల్‌పీఓ సాయిబాబా, ఎంపీఓ శ్రీనివాస్, ఏపీఓ అంజిరెడ్డి, ఏపీఎం సంగమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

రైతు ముంగిట్లో వ్యవసాయ శాస్త్రవేత్తలు



యువ శాస్త్రవేత్తలను సన్మానించిన గ్రామస్తులు

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని తునికి కేవీకే ఆధ్వర్యం ఆరుగురు వ్యవసాయ యువ శాస్త్రవేత్తలు బుధవారం తునికిలో పర్యటించారు. కేవీకే హెడ్‌అండ్ సైంటిస్ట్ శంభాజీ దత్తాత్రేయ నల్కర్, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ రవికుమార్ ఆధ్వర్యంలో 115వ ఫౌండేషన్ కోర్స్ ఫర్ అగ్రికల్చర్ సర్వీసెస్‌లో భాగంగా కొత్తగా నియామకమైన వివిధ రాష్ట్రాలకు చెందిన యువ శాస్త్రవేత్తలు వచ్చారు. ఇందులో సందీప్ (ఆంధ్రప్రదేశ్), రణబీర్ (పశ్చిమబెంగాల్), గోపాలకృష్ణ (తమిళనాడు), లావణ్య (తెలంగాణ), రవిప్రకాష్ (ఉత్తరప్రదేశ్), రుచిత(కర్ణాటక) ఉన్నారు. వీరంతా గ్రామంలో నెలరోజులపాటు పర్యటించి వ్యవసాయం, వ్యవసాయ అనుబంధ రంగాలకు సంబంధించిన సమాచారం సేకరించి రైతులతో చర్చించనున్నట్లు కేవీకే శాస్త్రవేత్త రవికుమార్ తెలిపారు. అనంతరం యువ శాస్త్రవేత్తలను గ్రామస్తులకు పరిచయం చేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సౌజన్య, మాజీ సర్పంచ్ సాయిలు, మానిక్యరెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

పాపన్నపేట(మెదక్): మండల కేంద్రంలో బుధవారం రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికలు నిర్వహించారు. ఈ పోటీల్లో జిల్లాలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థినీవిద్యార్థులు పాల్గొన్నారు. ఇందులో 12మంది బాలురు, 12 మంది బాలికలను ఎంపిక చేశారు. వీరంతా ఈ నెల 25న నిజామాబాద్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారు. కార్యక్రమంలో జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి రమేష్, ఉపాధ్యక్షుడు కుమార్, జాయింట్ సెక్రటరీ శ్రీకాంత్, రాజగౌడ్, శశికుమార్, కోశాధికారి రవి, మధు, ఆంజనేయులు, శ్రీను, రేణుక, లాజర్, గీత, మీనా పాల్గొన్నారు.

తెలంగాణ తల్లి పాత ఫొటోతో!



ఎంఈఓ కార్యాలయంలో తెలంగాణ తల్లి పాత ఫొటో పెట్టిన దృశ్యం

చిన్నశంకరంపేట(మెదక్): ప్రభుత్వం తెలంగాణ తల్లి ముఖ చిత్రం మార్చినా అధికారులు మాత్రం నేటికీ తెలంగాణ తల్లి పాత ఫొటోలనే ఉపయోగిస్తున్నారు. బుధవారం తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని విద్యా వనరుల కేంద్రం వద్ద తెలంగాణ తల్లి చిత్రపటం పాతదే పెట్టారు. దీంతో జాతీయ జెండా ఆవిష్కరణకు వచ్చిన నాయకులు విస్మయం వ్యక్తం చేశారు. అలాగే చిన్నశంకరంపేట ఎంపీడీఓ కార్యాలయంతో పాటు ప్రభుత్వ కార్యాలయాల్లో 9 గంటలకు జాతీయ జెండాను ఆవిష్కరించగా.. తహసీల్దార్ కార్యాలయంలో మాత్రం తహసీల్దార్ సమయానికి రాకపోవడంతో జాతీయ జెండాను సమయానికి ఆవిష్కరించలేదు. దాదాపు 9:15 నిముషాల వరకు వేచి చూసిన ఇతర శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు వచ్చి వెళ్లిపోగా.. ఆ తర్వాత తహసీల్దార్ మాలతి వచ్చి జాతీయ జెండాను ఆవిష్కరించారు. అయితే ఈ విషయంపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు మాజీ సర్పంచ్ రాజిరెడ్డి తెలిపారు.

ఉద్యోగులపై నిర్లక్ష్య వైఖరి తగదు

టీఎన్జీఓ జిల్లా అధ్యక్షుడు నరేందర్



మాట్లాడుతున్న టీఎన్జీఓ జిల్లా అధ్యక్షుడు దొంత నరేందర్

మెదక్ కలెక్టరేట్: ఉద్యోగులపై నిర్లక్ష్య వైఖరి తగదని టీఎన్జీఓ జిల్లా అధ్యక్షుడు దొంత నరేందర్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక టీఎన్జీఓ భవన్‌లో ఏర్పాటు చేసిన కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యోగుల పెండింగ్ బిల్లులు, కరువు భత్యం, నూతన పీఆర్సీ, ఆరోగ్య కార్డుల అమలుపై ప్రభుత్వం 18 నెలలుగా తాత్సారం చేస్తుందన్నారు. ఉద్యోగుల హక్కులను కాపాడే బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఉద్యోగుల పాత పెన్షన్ విధానం ప్రవేశపెట్టే విధంగా అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలన్నారు. చార్మినార్ జోన్ సాధనకు త్వరలో అన్ని వర్గాల ఉద్యోగులతో ఏర్పాటు చేయనున్న భారీ బహిరంగ సభ విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం సంఘపరంగా వృత్తిపరంగా పదోన్నతులు పొందిన సభ్యులను శాలువాతో సన్మానించారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి మీనికి రాజ్ కుమార్ పలు తీర్మానాలు ప్రవేశపెట్టి ఆమోదించారు. అలాగే పంచాయతీ కార్యదర్శుల ఫోరం జిల్లా కార్యదర్శిగా కాయితి సంతోష్‌ను నియమించారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి గాండ్ల అనురాధ, జిల్లా సహ అధ్యక్షుడు ఎండీ ఇక్బాల్ పాషా, కోశాధికారి చంద్రశేఖర్, ఉపాధ్యక్షులు ఫజులుద్దీన్, రఘునాథరావు, లీల, సంయుక్త కార్యదర్శులు శివాజీ, కిరణ్ కుమార్, రాధ, ఆర్గనైజింగ్ కార్యదర్శి విష్ణువర్ధన్ రెడ్డి, క్రీడల కార్యదర్శి గోపాల్, కార్యవర్గ సభ్యులు మరియా, సతీష్, సలావుద్దీన్, నర్సాపూర్ యూనిట్ అధ్యక్షుడు శేషాచారి, ఏడుపాయల వనదుర్గ యూనిట్ కార్యదర్శి ప్రశాంత్, పంచాయతీ కార్యదర్శుల ఫోరం జిల్లా అధ్యక్షుడు జంగం నగేష్, ఇరిగేషన్ ఫోరం కార్యదర్శి శ్రీ హర్ష, హెచ్‌డబ్ల్యూఓ ఫోరం కార్యదర్శి శేఖర్, ఏఈఓ ఫోరం కార్యదర్శి రాజశేఖర్, మెడికల్ ఫోరం కార్యదర్శి మంజుల, ఉద్యోగులు పాల్గొన్నారు.



యూరియా తిప్పలు ఇంకెన్నాళ్లు!

వెల్దుర్తిలో యూరియా కోసం బారులు తీరిన రైతులు

యూరియా కోసం రైతులకు తిప్పలు తప్పడం లేదు. నర్సాపూర్‌లో బుధవారం యూరియా కోసం వచ్చిన రైతులకు అధికారులు టోకెన్లు ఇచ్చి పంపించారు. రైతు వేదికకు 400 యూరియా బస్తాలు వచ్చాయని, రైతులకు టోకెన్లు ఇచ్చినట్లు వ్యవసాయాధికారి దీపిక తెలిపారు. అలాగే వెల్దుర్తి మండల కేంద్రంలోని రైతు వేదిక వద్ద యూరియా కోసం రైతులు బారులు తీరారు. ఉదయం 4 గంటల నుంచే రైతు వేదిక వద్ద యూరియా బస్తా కోసం క్యూలో నిల్చున్నారు. నిత్యం యూరియా కోసం కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నామని వాపోయారు. ప్రభుత్వం రైతులకు సరిపడా యూరియా సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. – నర్సాపూర్/వెల్దుర్తి(తూప్రాన్)



నర్సాపూర్ రైతు వేదికలో యూరియా టోకెన్ల కోసం గుమిగూడిన రైతులు

క్లుప్తంగా

జాతీయ స్వచ్ఛతా సేవా అవగాహన ర్యాలీ



ప్రతిజ్ఞ చేస్తున్న సిబ్బంది

జోగిపేట(అందోల్‌): అందోల్‌– జోగిపేట పుర పాలక సంఘంలో 'జాతీయ స్వచ్ఛత హీ సేవ 'కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ ఆదేశాను సారం బుధవారం నుంచి అక్టోబర్‌ 2వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు కమిషనర్‌ రవీందర్‌ తెలిపారు. ఈ సందర్భంగా ప్రజలు స్వచ్ఛత అవగాహనా ర్యాలీని పట్టణంలోని ప్రధాన వీధుల గుండా ర్యాలీని చేపట్టారు. ఇందులో భాగంగా అందోల్‌ పెద్దచెరువును శుభ్రం చేశారు. అనంతరం స్థానిక చౌరస్తా వద్ద ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెకర్టర్‌ వినయ్‌, ఆర్‌.ఐ.నారాయణ, లక్ష్మీనారాయణ, ప్రజాప్రతినిధులు, మెప్మా ఆర్పీలు ఆశావర్కర్లు సిబ్బంది పాల్గొన్నారు.

పక్షవాతానికి సకాలంలో వైద్యం అందించాలి



మాట్లాడుతున్న డాక్టర్‌ విక్రమ్‌కిశోర్‌రెడ్డి

జహీరాబాద్‌: పక్షవాతానికి గురైన వ్యక్తులకు నాలుగున్నర గంటల్లోనే వైద్యం అందించడం వల్ల వారి ఆరోగ్యాన్ని పరిరక్షించిన వారం అవుతామని హైదరాబాద్‌లోని మెడికోవర్‌ ఆస్పత్రి న్యూరో వైద్యుడు విక్రం కిశోర్‌రెడ్డి అన్నారు. బుధవారం జహీరాబాద్‌లోని సిటీ సెంటర్‌ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పక్షవాత రోగులకు సకాలంలో వైద్య సేవలందించేందుకు వీలుగా జహీరాబాద్‌లో ప్రత్యేక కేంద్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రోగికి గోల్డెన్‌ అవర్‌లో వైద్యం అందించడం ద్వారా సాధారణ స్థితికి తీసుకువచ్చే అవకాశం ఉంటుందన్నారు. ఎవరైనా పక్షవాతానికి గురైతే వెంటనే స్థానికంగా అందుబాటులో ఉన్న ఆస్పత్రిలో వైద్యం చేయించుకోవాలని సూచించారు. సమావేశంలో వైద్యులు సరిన్‌జాన్‌, ఆరాధన్‌రెడ్డి, వెంకటాద్రి పాల్గొన్నారు.

రిజర్వేషన్‌ కౌంటర్‌ మంజూరు

చేగుంట(తూప్రాన్‌): మండల కేంద్రమైన చేగుంటలోని వడియారం రైల్వే స్టేషన్‌కు రిజర్వేషన్‌ కౌంటర్‌ మంజూరైనట్లు బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గణేశ్‌ రవికుమార్‌ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల ఆర్వోబీ శంకుస్థాపనకు వచ్చిన దక్షిణ మధ్య రైల్వే డీఆర్‌ఎం సంతోష్‌కుమార్‌ వర్మను ఎంపీ రఘునందన్‌రావు రిజర్వేషన్‌ కౌంటర్‌ ఏర్పాటు చేయాలని కోరారు. ఎంపీ కోరిక మేరకు ఆయన మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ నెల 22న ఎంపీ రైల్వే అధికారులతో కలిసి రిజర్వేషన్‌ కౌంటర్‌ ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు.

కటింగ్‌ చేయలేదని దాడి..

వట్‌పల్లి(అందోల్‌): కటింగ్‌ చేయలేదన్న కోపంతో సెలూన్‌ యజమాని తల్లిదండ్రులపై దాడి చేశాడు. ఈ ఘటన అందోలు మండలం పోతిరెడ్డిపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా.... గ్రామానికి చెందిన మంగలి సాయిని తన ఇంటికి వచ్చి కటింగ్‌ చేయాలని ఫోన్‌లో అదే గ్రామానికి చెందిన ఉపేందర్‌ భూతులు తిట్టడమే కాకుండా బెదిరించాడు. అంతటితో ఊరుకోకుండా సాయి ఇంటికి వెళ్లి అతడి తల్లిదండ్రులు శంకర్‌, రుక్కమ్మలపై దాడి చేసి గాయపరిచాడు. దీంతో వారు జోగిపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు.

అప్పులబాధతో రైతు ఆత్మహత్య



రవీందర్‌

చిన్నశంకరంపేట(మెదక్‌): అప్పుల బాధతో రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మండలంలోని కామారం తండాలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ నారాయణగౌడ్‌ కథనం మేరకు... తండాకు చెందిన దేవాసోత్‌ రవీందర్‌(44) వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నాడు. కూరగాయలు పండించి విక్రయిస్తున్న క్రమంలో వారం రోజులుగా భారీ వర్షాలతో పంటలు పాడయ్యాయి. దీంతో ఇద్దరు బిడ్డల పెళ్లిళ్ల కోసం చేసిన అప్పులు ఎలా చెల్లించాలని బాధపడుతున్నాడు. కాగా ఇంటి నిర్మాణానికి అప్పు కోసం ప్రయత్నించగా ఎక్కడ అప్పు పుట్టలేదు. మనస్తాపంతో వ్యవసాయ పొలం వద్ద ఉన్న గుడిసెలో ఉరివేసుకున్నాడు.

రజాకార్లకు ఎదురొడ్డిన బైరాన్‌పల్లి

- మంత్రి పొన్నం ప్రభాకర్‌
- గ్రామంలో స్మారక స్తూపం నిర్మిస్తాం



అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్‌ , ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

మద్దూరు(హుస్నాబాద్‌): నిజాం రజాకార్లకు ఎదురొడ్డి పోరాడిన చరిత్ర బైరాన్‌పల్లి అమరవీరులదని మంత్రి పొన్నం ప్రభాకర్‌ అన్నారు. బుధవారం ప్రజా పాలన దినోత్సవంలో భాగంగా వీర బైరాన్‌పల్లి గ్రామంలోని అమవీరుల స్తూపం, బురుజు వద్ద భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డితో కలిసి మంత్రి నివాళులు అర్పించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ... 1948 సెప్టెంబర్‌ 17న తెలంగాణకు నిజమైజన స్వాతంత్య్రం వచ్చిందన్నారు. అర్ధరాత్రి నెత్తురు పారిన నేల బైరాన్‌పల్లి అని పేర్కొన్నారు. రజాకార్ల ఆగడాలను అడ్డుకుంటూ , వారి మూకలను తరిమిగొట్టిన గొప్ప చరిత్ర ఈనేలకు ఉందన్నారు. 1948 ఆగస్టు 27న రజాకార్లు గ్రామంలోకి ప్రవేశించి కాల్చి చంపి , ఇంటింటికీ తిరిగి మారణకాండ సృష్టించి మరో జలియన్‌వాలా బాగ్‌ను సృష్టించారన్నారు. గ్రామం బయట శవాల చుట్టూ మహిళలను వివస్త్రలు చేసి బతుకమ్మ ఆటలు ఆడించిన ఘటనను గుర్తు చేసుకుంటే బాధేస్తుందన్నారు. ఈ ప్రాంతం స్ఫూర్తితో వచ్చిన తెలంగాణలో కాంగ్రెస్‌ ప్రభుత్వం నీళ్లు, నిధులు, నియామకాలు, సంక్షేమం, అభివృద్ధితో ముందుకు వెళ్తున్నామని చెప్పారు. సీఎంతో మాట్లాడి బైరాన్‌పల్లి అమరవీరుల స్మారకం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే అమరవీరుల కుటుంబాలను ఆదుకుంటూ వారిని గౌరవించుకుంటామని మంత్రి పొన్నం పేర్కొన్నారు.

బైరాన్‌పల్లి అభివృద్ధికి కృషి: ఎంపీ చామల

మనందరం ఈరోజు స్వేచ్ఛా వాయులు పీల్చుకుంటున్నామంటే బైరాన్‌పల్లి అమర వీరుల త్యాగాల వల్లేనని అని ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. గ్రామానికి వీర బైరాన్‌పల్లిగా పేరు మార్చుకోడానికి గెజిట్‌ తీసుకువస్తామని, స్తూపం, బురుజు నిర్మాణం కోసం రూ. 10లక్షల నిధులు మంజూరు చేస్తామని తెలిపారు. గ్రామాభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డికి చెప్పి నిధులు మంజూరయ్యేలా కృషి చేస్తానన్నారు. మిగులు రాష్ట్రంగా ఉన్న తెలంగాణని గత ప్రభుత్వం పదేళ్లలో అప్పుల రాష్ట్రంగా మార్చిందన్నారు. కాంగ్రెస్‌ ప్రజాపాలనలో సన్నబియ్యం , ఇందిరమ్మ ఇళ్లు, కొత్త రేషన్‌ కార్డులను అందించామన్నారు. ఈ కార్యక్రమంలో జనగామ జిల్లా డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ రాజలింగం, టీపీసీసీ కార్యదర్శి గిరి కొండల్‌రెడ్డి, జనగామ జిల్లా యూత్‌ కాంగ్రెస్‌ ఉపాధ్యక్షుడు కమలాకర్‌ యాదవ్‌, బైరాన్‌పల్లి మాజీ సర్పంచ్‌ శ్రీనివాస్‌గౌడ్‌, తదితరులు పాల్గొన్నారు.

కొండెంగలను పట్టుకుంటాం

- ప్రత్యేక బృందాలను రప్పిస్తున్నాం
- జిల్లా ఫారెస్టు అధికారి శ్రీధర్‌రావు
- 'సాక్షి' కథనానికి స్పందన

సాక్షి ఎఫెక్ట్‌



జహీరాబాద్‌: బాధితుల వివరాలు సేకరిస్తున్న ఫారెస్టు అధికారులు

జహీరాబాద్‌: పట్టణంలో ప్రజలపై దాడి చేసి గాయపరుస్తున్న కొండెంగలను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాన్ని రప్పిస్తున్నట్లు డీఎఫ్‌ఓ సి.శ్రీధర్‌రావు పేర్కొన్నారు. బుధవారం 'సాక్షి' మెయిన్‌లో 'కొండెంగల వీరంగం', 20 మందికి గాయాలు శీర్షికన ప్రచురితమైన కథనానికి ఫారెస్టు, మున్సిపల్‌, పోలీసు శాఖల అధికారులు స్పందించారు. పట్టణంలోని శాంతినగర్‌, బాగారెడ్డిపల్లి, హౌసింగ్‌ బోర్డు, హమాలీ కాలనీల్లో కొండెంగల దాడిలో గాయపడిన బాధితులను పరామర్శించారు. ఆయా కాలనీల ప్రజలు వాటి నుంచి ఎదుర్కొంటున్న ఇబ్బందుల గురించి విన్నవించారు. గాయపడిన వారికి ప్రభుత్వం ఆర్థిక సహాయం చేయాలని ప్రజలు కోరారు. కాగా డీఎఫ్‌ఓ శ్రీధర్‌రావు, మున్సిపల్‌ కమిషనర్‌ సుభాష్‌రావుతో సంప్రదింపులు జరిపారు. కొండెంగలను పట్టుకునేందుకు నిపుణుల బృందాన్ని రప్పించేందుకు ఏర్పాట్లు చేశామని, మహబూబ్‌నగర్‌ నుంచి పిలిపిస్తున్నట్లు చెప్పారు. గురువారం ఉదయం పట్టుకుంటారని తెలిపారు. బాధితులకు తగిన వైద్య సేవలందించేలా చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు.

మరో ఇద్దరిపై దాడి ..

జహీరాబాద్‌ టౌన్‌: పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన మరో ఇద్దరిపై కొండముచ్చులు దాడి చేసి బుధవారం గాయపరిచాయి. శాంతినగర్‌కు చెందిన మారుతీరావు, సిద్ధులు వీధిలో వెళ్తుంటే రెండు కొండు ముచ్చులు వారిపై ఆకస్మికంగా దాడి చేశాయి. గాయపడిన వారిని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. జాగో తెలంగాణ నాయకులు రాములు నేత, శివప్రసాద్‌, ఎండీ ఇమ్రాన్‌ తదితరులు అటవీశాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. కాగా అధికారులు వచ్చి గాయపడిన వారి వివరాలు నమోదు చేసుకున్నారు. వీరికి పరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

సంజీవనితో పసి హృదయాలు పదిలం

మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు



గిఫ్ట్‌ ఆఫ్‌ లైఫ్‌ సర్టిఫికెట్లను అందజేస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు

కొండపాక(గజ్వేల్‌): సత్యసాయి సంజీవని ఆసుపత్రి.. పసి హృదయాలను పదిలం చేస్తున్న దేవాలయమని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. కొండపాకలోని సత్యసాయి సంజీవని చైల్డ్‌ హార్ట్‌ కేర్‌ ఆస్పత్రిలో వివిధ రాష్ట్రాలకు చెందిన 196 మంది చిన్న పిల్లలకు గుండె సంబంధిత వ్యాధులకు ఆపరేషన్లు విజయవంతమవ్వడంతో బుధవారం గిఫ్ట్‌ ఆఫ్‌ లైఫ్‌ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆస్పత్రిలో నిర్వహించిన కార్యక్రమంలో హరీశ్‌రావు మాట్లాడుతూ సత్యసాయి సంజీవని ఆస్పత్రి సేవలు విశ్వవ్యాప్తం అయ్యేలా ప్రతీ ఒక్కరం బాధ్యతగా కృషి చెద్దామన్నారు. జీవితం శాశ్వతం కాదని చేస్తున్న మంచి పనులు శాశ్వతంగా నిలుస్తాయన్నారు. కొండపాక శివారులో అనాథ వృద్ధాశ్రమం, అష్టాదశ శక్తి పీఠ దేవాలయం, సత్యసాయి బాలికల జూనియర్‌ కళాశాలతో పాటు సత్యసాయి సంజీవని చైల్డ్‌ హార్ట్‌ కేర్‌ ఆసుపత్రి వెలువడంతో ప్రపంచ దేశాల్లో ఈ గడ్డ సేవా రంగంలో గొప్పగా పేరొందుతోందని అన్నారు. అనంతరం గుండె ఆపరేషన్‌ చేయించుకున్న పిల్లలకు గిఫ్ట్‌ ప్‌ లైఫ్‌ సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో ఆస్పత్రి నిర్వహణ చైర్మన్‌ శ్రీనివాస్‌, ఎమ్మెల్సీలు యాదవరెడ్డి, దేశపతి శ్రీనివాస్‌,నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అధికారం ఎవరికీ శాశ్వతం కాదు..

ఎమ్మెల్యే చింతా ప్రభాకర్‌

సంగారెడ్డి: అధికారులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్‌, ఎమ్మెల్యే మాణిక్‌రావ్‌, మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్‌ మండిపడ్డారు. ఈ నేపథ్యంలో బుధవారం నియోజకవర్గ సమస్యలపై అదనపు కలెక్టర్‌ చంద్రశేఖర్‌ను కలిశారు. ఎమ్మెల్యే చింత ప్రభాకర్‌ మాటాడుతూ.. బేగంపేటలో ఫిషరీస్‌ బిల్డింగ్‌ కోసం స్థలం కేటాయించాలని కోరారు. సంగారెడ్డి సదాశివపేట మున్సిపాలిటీలో పెండింగ్‌లో ఉన్న వెజ్‌ నాన్‌ వెజ్‌ బిల్డింగ్‌ను పూర్తి చేయాలని కోరారు. ప్రజలు ఎన్నుకున్న శాసన సభ్యునికి అవమాన పరిచేలా కలెక్టర్‌ మాట్లాడడం బాధాకరమన్నారు. ఎమ్మెల్యేకు పూర్తిగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు అర్హత ఉంటుందని ప్రతిపక్షంలో ఉన్నామని జిల్లా ఇన్‌చార్జి మంత్రి 40 శాతం ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని ఆదేశాలు ఇస్తే కలెక్టర్‌ ప్రావీణ్య పట్టింపు లేని సమాధానాలు చెప్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జైపాల్‌రెడ్డి, బుచ్చిరెడ్డి, సాయి కుమార్‌, కొండల్‌ రెడ్డి, ప్రభాకర్‌, శ్రీధర్‌ రెడ్డి, విష్ణు తదితరులు ఉన్నారు.

చికిత్స పొందుతూ తల్లి మృతి

అనాథలుగా మారిన చిన్నారులు



కొడకండ్లలో తల్లి మృతదేహం వద్ద దిక్కుతోచని స్థితిలో ఉన్న పిల్లలు

గజ్వేల్‌రూరల్‌: విద్యుదాఘాతానికి గురై మహిళ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. దీంతో ఆమె ఇద్దరు పిల్లలు అనాథలుగా మారారు. ఈ ఘటన మండలంలోని కొడకండ్లలో చోటు చేసుకుంది. గ్రామస్తుల వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన మిండె గౌరయ్య–మనీలా(38) దంపతులకు కూతురు రేణ, కొడుకు విష్ణు ఉన్నారు. వీరికి ఇంటితో పాటు ఎలాంటి ఆస్తులు లేకపోవడంతో కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నారు. గౌరయ్య 4 ఏళ్ల క్రితం అనారోగ్యానికి గురై మృతి చెందడంతో పిల్లల బాధ్యత మనీలాపై పడింది. దీంతో ఆమె గజ్వేల్‌లోని ఓ హోటల్‌లో కూలీ పనులు చేస్తూ పిల్లలను సాకుతుంది. ఈ క్రమంలో నెల రోజుల క్రితం హోటల్‌లో పనిచేస్తుండగా విద్యుత్‌ షాక్‌ తగలడంతో గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. నాలుగేళ్ల క్రితం తండ్రి, ఇప్పుడు తల్లి మృతి చెందడంతో ఇద్దరు పిల్లలు అనాథలుగా మారారు. గ్రామస్తులు, బంధువుల సహకారంతో చందాలు వేసి బుధవారం మనీలా అంత్యక్రియలు నిర్వహించారు. ఇద్దరు పిల్లలను మానవతావాదులు, ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేశారు.

భవనం పైనుంచి దూకి..

- మతిస్థిమితం సరిగా లేని మహిళ మృతి
- ఆస్పత్రి నుంచి మృతదేహం తరలింపు
- పోలీసులతో బంధువుల వాగ్వాదం



అంజమ్మ

వట్‌పల్లి(అందోల్‌): మతిస్థిమితం సరిగాలేని మహిళ భవనంపై నుంచి దూకడంతో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ కేసు మండలంలో చర్చనీయాంశమైంది. వివరాలు... మునిపల్లి మండలం పెద్ద చెల్మడ గ్రామానికి చెందిన అంజమ్మ (45) అందోలు మండలంలోని మాసానిపల్లి గ్రామంలో గల తమ బంధువు కుమార్‌ గౌడ్‌ ఇంట్లో ఉంచారు. ఆమె కొంత కాలంగా అనారోగ్యంతో ఉండటంతో 15 రోజులుగా మందులు వాడకపోవడం వల్ల మతిస్థిమితం తప్పినట్లు బంధువులు చెప్పారు. 16న రాత్రి 9 గంటల సమయంలో అంజమ్మ భవనం పైకి ఎక్కి దూకింది. గమనించిన కుమార్‌ గౌడ్‌ అపస్మారక స్థితిలోకి వెళ్లిన ఆమెకు సీపీఆర్‌ చేసి, జోగిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి చనిపోయినట్లు నిర్ధారించారు. పోలీసులు వచ్చి మృతదేహాన్ని ఇంటికి తీసుకువెళ్లేందుకు అభ్యంతరం తెలిపారు. 17న 3 గంటల సమయంలో మృతదేహాన్ని పెద్ద చెల్మడ గ్రామానికి తరలించి అంత్యక్రియలకు ఏర్పాట్లు చేస్తున్నారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ పాండు వెళ్లి మృతదేహాన్ని తమకు అప్పగించాలన్నారు. దీంతో మృతురాలి బంధువులు, మృతురాలి భర్త రాజయ్య పోలీసులతో వాగ్వివాదానికి దిగారు. చివరకు నచ్చజెప్పి సదాశివపేట ప్రభుత్వ ఆస్పత్రిలో మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి వారికి అప్పగించారు.

దేశ గురువు పేరిట డబ్బులు వసూలు

నంగునూరు(సిద్దిపేట): ప్రజలను మభ్య పెట్టి డబ్బులు వసూల్‌ చేస్తున్న ఓ వ్యక్తిని యువకులు నిలదీయడంతో ఫోన్‌పే ద్వారా తిరిగి డబ్బులు చెల్లించాడు. ఈ ఘటన మండలంలోని బద్దిపడగలో చోటు చేసుకుంది. గ్రామస్తులు వివరాలు... సోమవారం రాత్రి గ్రామానికి తెల్లగుర్రంపై ఓ వ్యక్తి అనుచరులతో వచ్చి తాను దేశ గురువును అని మీ బాధలు, ఇబ్బందులు తొలగిస్తానని నమ్మబలికాడు. అతని మాటలు నమ్మిన కొందరు వడ్డెర కాలనీలో బస ఏర్పాటు చేశారు. ఉదయం గురువు గ్రామంలో తిరుగుతాడని గుర్రానికి నీళ్లు పోసి బాధలు చెప్పుకుంటే తాయత్తు ఇచ్చి సమస్యలు తీరుస్తాడని దండోరా వేయించారు. మీ సమస్యలు దూరం చేస్తానని, అంత వరకు తాను ఇచ్చే తాయత్తు కట్టుకోవాలని చెప్పి డబ్బులు తీసుకున్నాడు. అతని ప్రవర్తనపై అనుమానం కలుగడంతో సుంచు స్వామి, వడ్లూరి బాబుతోపాటు యువకులు గురువుతోపాటు అతని అనుచరులను నిలదీశారు. గ్రామస్తుల వద్ద తీసుకున్న డబ్బులు ఇవ్వకుంటే పోలీసులకు ఫిర్యాదు చేస్తామనడంతో కొందరికి ఫోన్‌పే ద్వారా డబ్బులు చెల్లించారు. అనంతరం అక్కడి నుంచి జారుకున్నారు.

ఇంట్లో భారీ చోరీ..

బంగారం, వెండి అపహరణ

పటాన్‌చెరు టౌన్‌: ఓ ఇంట్లో దొంగలు పడి బంగారు, వెండి ఆభరణాలను ఎత్తుకెళ్లారు. ఈ ఘటన పటాన్‌చెరు పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... ఇంద్రేశం మున్సిపాలిటీ పరిధిలోని పీఎన్‌ఆర్‌ టౌన్‌ షిప్‌లో ఉంటున్న పవన్‌ కుమార్‌ సాఫ్ట్‌వేర్‌ ఉద్యోగం చేస్తున్నాడు. తన భార్య లక్ష్మి హైటెక్‌ సిటీలోని ఓ ప్రైవేట్‌ స్కూల్‌లో టీచరుగా విధులు నిర్వహిస్తుండటంతో 16న ఉదయం అక్కడ వదిలి, అతడు కూడా తన విధులకు వెళ్లాడు. సాయంత్రం లక్ష్మి ఇంటికి వచ్చి చూసేసరికి తాళం పగులగొట్టి ఉంది. లోపలికి వెళ్లి చూడగా బీరువా తెరిచి ఉంది. అందులో ఉన్న 20 తులాల బంగారం, నాలుగు కిలోల వెండి, రూ.8 వేల నగదును దొంగలు ఎత్తుకెళ్లినట్టు గుర్తించింది. బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ట్రాన్స్‌ఫార్మర్‌లోని కాపర్‌ వైర్‌ చోరీ

చేర్యాల(సిద్దిపేట): విద్యుత్‌ ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసి అందులోని కాపర్‌ వైర్‌ను చోరీ చేశారు. ఈ ఘటన మండల పరిధిలోని ముస్త్యాల శివారులో బుధవారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం... గ్రామ శివారులోని సలాక్‌పూర్‌ క్రాస్‌ రోడ్డు సమీపంలో నాగోతి సమర్‌ అంజయ్యకు చెందిన స్థలంలో 25 కేవీ విద్యుత్‌ ట్రాన్స్‌ఫార్మర్‌ను గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేసి అందులోని కాపర్‌ వైర్‌ను అపహరించారు. చోరీ విషయమై స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు విద్యుత్‌ అధికారులు తెలిపారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

సదాశివపేట రూరల్‌ (సంగారెడ్డి): మండలంలోని ఇబ్రహీంబాద్‌ గ్రామానికి చెందిన గారకుర్తి కృష్ణకు చెందిన పాడి గేదె విద్యుత్‌ షాక్‌తో మృతి చెందింది. వివరాలు ఇలా... గ్రామ శివారులో మేత మేపుతుండగా ప్రమాదవశాత్తు అక్కడ ఉన్న ఎర్తింగ్‌ వైర్లకు తగలడంతో విద్యుదాఘాతంతో గేదె అక్కడికక్కడే మృతి చెందింది. గేదె విలువ రూ.80 వేలు ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు వేడుకున్నాడు.

గంజాయి అమ్ముతున్న వ్యక్తి అరెస్టు



కొమురవెల్లి(సిద్దిపేట): వివరాలు వెల్లడిస్తున్న సీఐ



మనోహరాబాద్‌(తూప్రాన్‌): నిందితుడిని అదుపులోకి తీసుకున్న ఎక్సైజ్‌ టాస్క్‌ఫోర్స్‌ పోలీసులు

కొమురవెల్లి(సిద్దిపేట): గంజాయి అమ్ముతున్న వ్యక్తిని టాస్క్‌ఫోర్స్‌, పోలీసులు కలిసి అరెస్టు చేశారు. బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో చేర్యాల సీఐ ఎల్‌. శ్రీను ఎస్‌ఐ రాజుతో కలిసి వివరాలు వెల్లడించారు. మండల శివారులోని దాచారం గుట్ట సమీపంలో ఓ వ్యక్తి గంజాయి విక్రయిస్తున్నాడని విశ్వసనీయ సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్‌, పోలీసులు కలిసి దాడి చేశారు. ఈ దాడిలో కుంభ భూమరాజును అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి 195 గ్రాముల గంజాయి, మొబైల్‌ ఫోన్‌, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

పారిశ్రామిక వాడలో..

తూప్రాన్‌, మనోహరాబాద్‌(తూప్రాన్‌): పారిశ్రామిక ప్రాంతంలో బీహార్‌కు చెందిన వ్యక్తి నుంచి 1.350 గ్రాముల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. బుధవారం ఎక్సైజ్‌ టాస్క్‌ఫోర్స్‌ సీఐ గోపాల్‌ వివరాలు వెల్లడించారు. మనోహరాబాద్‌ మండలం పారిశ్రామిక ప్రాంతంలో గంజాయి విక్రయాలపై నిఘా ఏర్పాటు చేశారు. అనుమానాస్పద వ్యక్తులను విచారించినట్లు తెలిపారు. తమ విచారణలో ఓ స్టోరేజీ పరిశ్రమలో బీహార్‌కు చెందిన ముఖేశ్‌ కుమార్‌ మండల్‌(29) ఆయా పరిశ్రమల్లో కార్మికులతో పాటు చుట్టుపక్కల గ్రామాల యువకులకు గంజాయి విక్రయిస్తున్నట్లు గుర్తించారు. అతడిని అదుపులోకి తీసుకొని ఎండు గంజాయి, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని నర్సాపూర్‌ ఎక్సైజ్‌ అధికారులకు అప్పగించారు. ఈ దాడుల్లో ఎస్‌ఐ బాలయ్య, హెడ్‌కానిస్టేబుల్‌ చంద్రయ్య, కానిస్టేబుళ్లు రాజు, నరేశ్‌, రవి, హరీశ్‌లు పాల్గొన్నారు.

వేర్వేరు చోట్ల ముగ్గురు అదృశ్యం



సీతారాం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ఓ యువకుడు అదృశ్యమయ్యాడు. ఈ ఘటన తెల్లాపూర్‌ మున్సిపల్‌ పరిధిలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... కొల్లూరు డబుల్‌ బెడ్‌రూం(కే సీఆర్‌నగర్‌)కాలనీలో నివాసముండే సీతారాం క్యాబ్‌డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం ఉదయం ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు అతడికి ఫోన్‌ చేయగా స్విచ్‌ ఆఫ్‌ వచ్చింది. ఆచూకీ కోసం వెతికినా లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కిరాణా షాప్‌నకు వెళ్లిన మహిళ..



మమత కుమారి

పటాన్‌చెరు టౌన్‌: మహిళ అదృశ్యమైంది. బీహార్‌ నుండి బతుకుదెరువు కోసం వచ్చిన సంతోష్‌ భార్యతో కలిసి డివిజన్‌ పరిధిలోని అంబేద్కర్‌ కాలనీలో ఉంటూ ప్రైవేట్‌ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. ఈ క్రమంలో ఈనెల 16న సంతోష్‌ భార్య మమతా కుమారి షాప్‌కు వెళ్తున్నానని చెప్పి తిరిగి రాలేదు. పలు చోట్ల వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో భర్త పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

వేప పుల్లల కోసం వెళ్లి...



రాంలా నాయక్‌

పటాన్‌చెరు టౌన్‌: వేప పుల్లల కోసం వెళ్లిన వ్యక్తి అదృశ్యమయ్యాడు. పోలీసుల వివరాల ప్రకారం... తెల్లాపూర్‌ మున్సిపాలిటీ పరిధిలోని ముత్తంగి విజేత కాలనీకి చెందిన రాంలా నాయక్‌ 16న తెల్లవారుజామున పళ్లు తోమేందుకు వేప పుల్లలు తీసుకొస్తానని ఇంటి నుండి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు వెతికినా ఆచూకీ లభించలేదు. భార్య పోలీసులకు ఫిర్యాదు చేశారు.

సేవే లక్ష్యం.. అవగాహనే ముఖ్యం

- పల్లె సేవలో ఎన్‌ఎస్‌ఎస్‌ వలంటీర్లు
- అవగాహన కార్యక్రమాల్లో విద్యార్థినులు



ఎర్రవల్లిలో ప్లాస్టిక్‌ను సేకరిస్తున్న విద్యార్థులు

మర్కూక్‌(గజ్వేల్‌): గ్రామాల అభివృద్ధిలో ప్రతి ఒక్కరి బాధ్యత ఉంటుందని, ప్రతి ఒక్కరిలో చైతన్యం వచ్చేలా తమ వంతు కృషి చేస్తున్నారు. సేవే లక్ష్యంగా స్వచ్ఛందంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు ఎన్‌ఎస్‌ఎస్‌ వలంటీర్లు. గ్రామంలోని వీధుల్లో చెత్తా చెదారం, ప్లాస్టిక్‌, మురుగు నీరు, ప్రజలకు రోగాలు ఏ విధంగా వస్తున్నాయని అవగాహన కల్పిస్తున్నారు. ఆరోగ్యవంతమైన గ్రామాలుగా తయారు చేయాలనే లక్ష్యంతో 60 మంది విద్యార్థినులు గ్రూపులుగా విడిపోయి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

సిద్దిపేట జిల్లా మర్కూక్‌ మండలంలోని మాజీ సీఎం దత్తత గ్రామం ఎర్రవల్లిలో హైదరాబాద్‌లోని బేగంపేట ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థినులు ఎన్‌ఎస్‌ఎస్‌ శిబిరం నిర్వహిస్తున్నారు. ఈ కళాశాల విద్యార్థినులు సుమారు 15 సంవత్సరాలుగా సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు. మూడు రోజుల నుండి ఎర్రవల్లి గ్రామంలో ఉంటూ పలు సేవా కార్యక్రమాలు చేపట్టి ప్రజలకు వివరిస్తున్నారు. గ్రామంలో రోడ్లపై మురుగునీరు పారుతుండటంతో దోమలు వ్యాప్తి చెంది వ్యాధులు సోకే ప్రమాదం ఉందని గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్నారు. హెల్త్‌ క్యాంపు నిర్వహించి రక్త పరీక్ష, హిమోగ్లోబిన్‌, బీపీ, షుగర్‌ వాటికి వెంటనే మందులు ఇస్తున్నారు. గ్రామ వీధుల్లో తిరుగుతూ పేరుకుపోయిన ప్లాస్టిక్‌ వ్యర్థాలు, కవర్లను తొలగిస్తున్నారు. మూడు రోజులుగా గ్రామ ప్రజలకు స్వచ్ఛతపై అవగాహన కల్పిస్తున్నారని మాజీ సర్పంచ్‌ భాగ్య తెలిపారు.

వ్యాధులపై అవగాహన



ప్రజలు పరిసరాల పరిశుభ్రత పాటించాలి. రోగాల బారిన పడకుండా ఉండేందుకు తమ వంతు సూచనలు, సలహాలు ఇస్తున్నాం. వారికి అవగాహన కల్పించేలా స్వయంగా తామే పరిసరాలను శుభ్రం చేశాం. ప్రత్యేకంగా డెంగీ వ్యాధిపై అవగాహన కల్పించాం.

– ప్రియా, విద్యార్థిని


ప్రజలతో మమేకమై..



నేను బేగంపేట మహిళా కళాశాలలో డిగ్రీ థర్డ్‌ ఇయర్‌ చదువుతున్నాను. ఎన్‌ఎస్‌ఎస్‌ క్యాంపులో పాల్గొని ఇలాంటి సేవా కార్యక్రమాలు చేయడం సంతోషంగా ఉంది. గ్రామాల్లోకి వచ్చి ప్రజలతో మమేకమై చాలా విషయాలు తెలుసుకున్నా. మునుముందు ఇలాంటి కార్యక్రమాలు చేపడుతా.

– నిక్షిత, విద్యార్థిని

వ్యాధులు సోకకుండా జాగ్రత్తలు



గ్రామ ప్రజలకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించాం. హెల్త్‌ క్యాంపు నిర్వహించి రక్త నమూనాలను సేకరించి వెంటనే మందులు పంపిణీ చేశాం. డెంగీ సోకకుండా జాగ్రత్తలు సూచించాం. ప్రజల సహకారం అభినందనీయం.

– డాక్టర్‌ ప్రసన్న (ఎన్‌ఎస్‌ఎస్‌ ప్రోగ్రాం ఆఫీసర్‌)